నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
3 | నిజామాబాద్, శనివారం 13 జనవరి 2024 | KAMAREDDY



## ఎల్లారెడ్డి విద్యార్థి అరుదైన ఘనత

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 12: ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి సమీర్ అరుదైన ఘనత సాధించాడు. హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో ఈ నెల 2 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ ఎన్ఎస్ఎస్ శిబిరంలో పాల్గొన్నాడు. ఇందులోభాగంగా ఈ నెల 10న ట్రైనర్ సోనమ్ సహాయంతో సముద్ర మట్టానికి 2875 మీటర్ల ఎత్తులో ఉన్న హిమాలయ శిఖరం ట్రైఎండ్ ఆల్టిట్యూడ్‌ను సమీర్ అధిరోహించినట్లు శిబిర నిర్వాహకులు తెలిపారు. ఈ ఘనత సాధించిన సమీర్‌ను ఎల్లారెడ్డి ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, తెలంగాణ యూనివర్సిటీ సిబ్బంది అభినందించారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ

ఖలీల్‌వాడి, జనవరి 12 : జిల్లా కేంద్రంలోని సహకార కేంద్ర బ్యాంకులో డీసీసీబీ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి, సాయికుమార్, శరత్, శాంతేశ్వర్‌పటేల్, భూమన్న, లింగయ్య, మోతీలాల్, శంకర్, ఆనంద్, నాబార్డు డీడీఎం ప్రవీణ్‌కుమార్, ఉమ్మడి నిజామాబాద్ డీసీవో సింహాచలం, బ్యాంకు సీఈవో నాగభూషణం తదితరులు పాల్గొన్నారు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి

# హరితహారం లక్ష్యాలను వందశాతం సాధించాలి

నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి

కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్



అధికారులతో మాట్లాడుతున్న కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీపాటిల్

కామారెడ్డి, జనవరి 12 : హరితహారం కింద నిర్దేశించిన లక్ష్యాలను వందశాతం సాధించేందుకు అధికారులు ప్రణాళికాబద్ధంగా చిత్తశుద్ధితో కృషి చేయాలని కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం హరితహారం కార్యక్రమంపై జిల్లా అటవీ శాఖాధికారి వికాస్ మీనాతో కలిసి అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 2024–25 వార్షిక సంవత్సరాల్లో వివిధ శాఖల ద్వారా మొక్కలు నాటేందుకు లక్ష్యాలను నిర్దేశిస్తూ ప్రణాళికాబద్ధంగా ముందుకుసాగాలని సూచించారు. నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలన్నారు. 2024లో 26లక్షల 40 వేల లక్ష్యం నిర్దేశించుకున్నామని, 2025లో 17 లక్షల 92 వేల మొక్కలు నాటేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. 2026 నాటికి మొక్కలు నాటేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఆర్డీవో సాయన్న, జిల్లా వ్యవసాయ అధికారిణి భాగ్యలక్ష్మి, పశు సంవర్ధక శాఖ అధికారి సింహారావు, బీసీ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, కార్మిక శాఖ సహాయ కమిషనర్ సురేందర్ కుమార్, మెప్మా పీడీ శ్రీధర్, ఆబ్కారీ, మున్సిపల్, హార్టికల్చర్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## కోడి పందాలపై పోలీసుల కొరడా..

జిల్లాలో ఈసారి ముందుగానే కోడి పందాల స్థావరాలు బయటపడడంతో పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. స్థానిక పోలీసులతో సంబంధంలేకుండా కోడి పందాల స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల ద్వారా కొరడా ఝులిపించేందుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ నుంచి పోలీస్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు అందాయి. గత నెల క్రితం నుంచే వీటిపై పోలీసులు దృష్టి సారించారు. డిసెంబర్ 28న రుద్రూర్ మండల కేంద్రం సమీపంలో కోడి పందాల స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి 11 మందిని పందెంరాయుళ్లను పట్టుకున్నారు. నాలుగు రోజుల కిందట పొతంగల్ మండల కేంద్రం సమీపంలో మంజీర తీరంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి నలుగురు పందెంరాయుళ్లను, మూడు కోళ్లను, రూ.30 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో కోడి పందాల నిర్వాహకులు సంక్రాంతికి ఎన్నో రోజులముందుగానే కోడి పందాలు ఏ విధంగా నిర్వహిస్తున్నారో చెప్పటానికి ఈ సంఘటనలే నిదర్శనం. ఈ రెండు సంఘటనల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులే కోడి పందాలపై దాడులు చేయడంతో.. స్థానిక పోలీసుల పనితీరుపై అనుమానాలు పెరుగుతున్నాయి.

# కోడి పందేలకు రెడీ

శివారు ప్రాంతాల్లో రహస్యంగా నిర్వహణ

బోధన్ డివిజన్‌లో ముందస్తుగానే కోడి పందాలు

ఇప్పటికే రెండుచోట్ల పట్టుకున్న పోలీసులు

**జిల్లాలో అక్కడక్కడ 'బరులు' సిద్ధం**

*సంక్రాంతి వచ్చిందంటే పతంగులు, పిండివంటలే కాదు కోడి పందేలు కూడా గుర్తుకొస్తాయి. అయితే, ఆంధ్ర ప్రాంతంలో ఎక్కువగా కనిపించే ఈ సంస్కృతి మన జిల్లాలోనూ అక్కడక్కడ కనిపిస్తుంటుంది. పలు ప్రాంతాల్లో గుట్టుగా నిర్వహిస్తుంటారు. ఈసారి కూడా 'బరి'లోకి దిగేందుకు పందెంరాయుళ్లు సిద్ధమయ్యారు. ఇప్పటికే బోధన్ డివిజన్‌లో కోడిపందాలు ప్రారంభమయ్యాయి. ఇక, సోమవారం రోజున సంక్రాంతి పండుగ ఉన్నందున శనివారం నుంచి కోడి పందాలు జోరందుకునే అవకాశం ఉందని, పండుత తర్వాత కూడా వారం రోజులపాటు ఈ జోరు కొనసాగే అవకాశముంటుంది?*

*–బోధన్, జనవరి 12*

జిల్లాకు ఎన్నో దశాబ్దాల కిందట వ్యవసాయం కోసం ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా జిల్లాల నుంచి వేలాది కుటుంబాలు వలస వచ్చి స్థిరపడ్డారు. వారితో పాటు కోడిపందాల సంస్కృతి కూడా ఇక్కడికి వ్యాప్తి చెందింది. సంక్రాంతి సందర్భంగానే ఈ జూదం జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో జోరుగా జరుగుతుంది. అంతేతప్ప ఈ కోడి పందేలు ఉభయ గోదావరి జిల్లాల్లో మాదిరిగా ఊరూరా జరిగే ఆనవాయితీ మన దగ్గర లేదు. దశాబ్దాల క్రితం వలసవచ్చినవారు స్థిర నివాసాలను ఏర్పాటుచేసుకున్న కాలనీలను 'క్యాంప్‌లు' అని పిలుస్తుంటారు. ఈ క్యాంప్‌ల శివార్లలోనే గతంలో కోడి పందేలు జరిగేవి. క్యాంప్‌ల శివార్లకు గుట్టలు తోడయితే.. పందెంరాయుళ్లు అక్కడ రహస్య స్థావరాలు ఏర్పాటుచేసి కోడి పందాల బరులు ఏర్పాటుచేస్తుంటారు. క్యాంప్‌లకు దూరంగా ఉండే కొన్ని గుట్టలు కూడా రహస్యంగా కోడి పందాల నిర్వహణకు స్థావరాలుగా మారాయి. ఏటా జిల్లాలోని గోదావరి, మంజీర పరీవాహక ప్రాంతంలోని కొన్నిచోట్ల కోడి పందాలు జరుగుతున్నాయి. అటు వర్ని, కోటగిరి, రుద్రూర్, ఎడపల్లి మండలాల్లోనూ, ఇటు నందిపేట్, నవీపేట్, మాక్లూర్, డిచ్‌పల్లి మండలాల్లోనూ కోడి పందాల జోరు కనిపిస్తుంటుంది. వర్ని మండలంలోని హూమ్నాపూర్ గుట్టలు, రుద్రూర్ మండంలోని రాయకూర్ గుట్టలు, నందిపేట్ మండలంలోని సెటిలర్స్ క్యాంప్‌లకు సమీపంలోని కొన్ని ప్రాంతాలు, ఎడపల్లి, నవీపేట్ మండలాల్లోని సలీం ఫారం, పోచారం గుట్టలు గతంలో ఈ పందాలకు స్థావరాలుగా ఉండేవి. జిల్లాలోని సత్యనారాయణపురం, హూమ్నాపూర్, పెంటాఖుర్దు, ధర్మారం తదితర గ్రామాలు కూడా గతంలో కోడి పందాలకు నిలయాలుగా ఉండేవి. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కోడి పందేల నిర్వాహకులు స్థావరాలను మార్చుతున్నారు. రహస్య స్థావరాలుగా రానున్న వారం రోజులపాటు భారీగా కోడి పందేల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు సమాచారం. ఇక్కడ జరిగే కోడి పందేల్లో లక్షలు చేతులు మారుతాయని చెబుతారు.

### కఠిన చర్యలు తప్పవు..

కోడి పందేలు ఎక్కడా జరగకుండా గట్టి నిఘా ఏర్పాటుచేశాం. గ్రామాల్లో అడ్వాన్స్ ఇంటిలిజెన్స్ ఏర్పాటుచేసి పందెంరాయుళ్ల కదలికలను గమనిస్తున్నాం. గతంలో కోడి పందేలు నిర్వహించినవారిని గుర్తించి ఈ రోజు, రేపు బైండోవర్ చేయాలని పోలీస్ స్టేషన్లకు ఆదేశాలు ఇచ్చాం. ఎవరైనా కోడి పందాలను నిర్వహిస్తే వారిపై కఠినంగా వ్యవహరిస్తాం. బరుల స్థావరాలు తెలిస్తే ప్రజలు పోలీసులకు సమాచారమివ్వాలి.

**- కె.ఎం.కిరణ్‌కుమార్, బోధన్ ఏసీపీ**



# పతంగుల పండుగ..



### సంక్రాంతి

అంటేనే పతంగుల పండుగ. పగటి పూటే తారలు దిగివచ్చినట్లుగా.. నింగికి నిచ్చెన వేసినట్టుగా .. ఎగిరే రంగురంగుల పతంగులు కనువిందు చేస్తాయి. చిన్నా, పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ పతంగులు ఎగురవేస్తూ ఆనందంగా గడుపుతారు. ప్రతిసారిలాగే.. ఈ ఏడాది కూడా అందమైన పతంగులు మార్కెట్‌లో సందడి చేస్తున్నాయి. మార్కెట్‌లో విభిన్న రకాల పతంగులు దర్శనమిస్తున్నాయి. చిన్నాపెద్ద తేడా లేకుండా అందరినీ ఆకట్టుకోవడంతో పతంగులు ఎగురవేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. పండుగ ముందు పతంగుల దుకాణాలు కొనుగోలుదారులతోసందడిగా మారాయి.

### ఆకట్టుకుంటున్న పతంగులు

మార్కెట్లో పతంగులు, చెరకలు, దారాలు, మాంజాలు విక్రయిస్తున్నారు. గాలి పటం సైజు నాణ్యతను బట్టి రెండు రూపాయల నుంచి రూ. 150 వరకు (ప్లాస్టిక్) కాగితంతో చేసినవి అందుబాటులో ఉన్నా యి. రెండు కాగితాలతో చేసినవి సైజును బట్టి రూ. 5 నుంచి 40 వరకు విక్రయిస్తున్నారు. మాంజాలలో పాండే, పెన్సిల్ కట్, కీంచ్‌కట్ వివిధ ధరల్లో లభ్యమవుతున్నారు. యువత వీటిని కొనడానికి ఇష్టపడుతున్నారు.

### జాగ్రత్తలు పాటిస్తేనే మేలు..

- చిన్నారులు, యువత పతంగులను ఎగురవేసే సమయాల్లో పలు జాగ్రత్తలను పాటిస్తే పండుగను సంతోషంగా జరుపుకోవచ్చు.
- మైదాన ప్రాంతాల్లో మాత్రమే పతంగులను ఎగురవేయాలి.
- విద్యుత్‌వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఉండే చోట పతంగులను ఎగురవేసే సమయాల్లో జాగ్రత్తలు పాటించాలి.
- పెద్దపెద్ద భవనాలు, కొండ ప్రాంతాల్లో పతంగులను ఎగురవేయకపోవడమే శ్రేయస్కరం.
- అత్యంత ప్రమాదకరమైన చైనా మాంజాను ఉపయోగించి పతంగులను ఎగురవేయరాదు.
- పతంగులు ఎగురవేసేటప్పుడు చిన్నారులను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి.





పతంగుల దుకాణాల వద్ద సందడి..

# కేసీఆర్ ప్రభుత్వ పథకాలను కొనసాగించండి


మంజూరైన అభివృద్ధి పనులను ప్రారంభించండి..

అవసరమైతే ఆ క్రెడిట్ అధికార పార్టీ నాయకులు తీసుకోండి

సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు రద్దు చేయడం సరికాదు..

బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం



వేల్పూర్ మండలం అక్లూర్‌లో నూతన పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల

బాల్కొండ/ వేల్పూర్/ ఏర్గట్ల, జనవరి 12 : కేసీఆర్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం చేపట్టిన పథకాలను యథావిధిగా కొనసాగించాలని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన బాల్కొండ నియోజకవర్గంలో పర్యటించారు. ఏర్గట్ల మండలం నాగేంద్రనగర్, బాల్కొండ మండలం నాగపూర్, వేల్పూర్ మండలం అక్లూర్ గ్రామంలో నిర్మించిన నూతన పంచాయతీ భవనాలను ప్రారంభించారు. అక్లూర్‌లో అంగన్‌వాడీ సెంటర్, ఏర్గట్ల మండలం తడ్‌పాకల్‌లో పల్లె దవాఖానకు ప్రారంభోత్సవం చేశారు.ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ.. కేసీఆర్‌ప్రభుత్వంలో మంజూరైన పథకాలు, పనులు రద్దు చేయడం సరికాదని, వాటిని అలాగే కొనసాగించాలని అన్నారు. ఆ పనులన్నీ బీఆర్ఎస్ పార్టీ లెటర్‌హెడ్ మీద మంజూరు చేసినవి కావని పేర్కొన్నారు. ప్రభుత్వ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ అప్రూవల్‌తో వివిధ శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు నిజామాబాద్, సిరిసిల్ల జిల్లాల కలెక్టర్లు తెలంగాణ ప్రభుత్వం తరపున బాల్కొండ నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనుల కోసం అధికారికంగా మంజూరు చేసినవని వివరించారు. ప్రజలు, వీడీసీ, కులసంఘాల సభ్యులు మంజూరైన పనుల ప్రారంభం కోసం ఆశతో ఉన్నారని తెలిపారు. స్థానిక అధికార పార్టీ నాయకులు ఆ పనులు కొనసాగించేలా చూడాలని, ఆ పనుల క్రెడిట్ కూడా వారే తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినా ఇక్కడ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ప్రజలు తనను ఆశీర్వదించి గెలిపించారని అన్నారు. గతంలో వివిధ శాఖల ద్వారా తాను మంజూరుచేసి తీసుకువచ్చిన రోడ్లు, బ్రిడ్జిలు, చెక్‌డ్యామ్‌లు, కులసంఘాల భవనాలు, ఇతర అభివృద్ధి పనులను రద్దు చేయకుండా కొనసాగించాలని సీఎం రేవంత్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు– భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డిని ప్రజల తరపున కోరుతున్నట్లు పేర్కొన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో స్థలం ఉండి, సొంతిల్లు లేని ఆరు వేల మందికి గృహలక్ష్మి కింద ఇంటి నిర్మాణానికి రూ. 3లక్షల చొప్పున మంజూ రు చేశామన్నారు. ఏ పార్టీ, ఏ వర్గం అనేది చూడకుండా సమ దృష్టితో వీరందరి ఎంపిక జరిగిందని తెలిపారు. వీరందరికీ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో తొలి ప్రాధాన్యం ఇచ్చి వారికి సొంతిల్లు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లాలో విషాదం

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం

అశోక్‌సాగర్ వద్ద ఇద్దరు .. భిక్కనూరులో మరో ఇద్దరు..

మరొకరి పరిస్థితి విషమం..దవాఖానలో చికిత్స






సమీర్,అనాస్ (ఫైల్)

వినాయకనగర్/ భిక్కనూరు, జనవరి 12: ఉమ్మడి జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. శుక్రవారం సాయంత్రం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం చెందగా..ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడినవారిని దవాఖానకు తరలించగా..చికిత్స పొందుతున్నారు. నిజామాబాద్ నగర శివారులోని నెహ్రూనగర్ పరిధిలోని అశోక్ సాగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృత్యువాత పడగా,మరో యువకుడు తీవ్రగాయాలతో దవాఖానలో చికిత్సపొందుతున్నాడు. నెహ్రూనగర్ కు చెందిన అనాస్(17), సమీర్(20), కరీం ముగ్గురు స్నేహితులు కలిసి బైక్‌పై జాన్కంపేట్ వైపు వెళ్తున్నారు. అదే సమయంలో అశోక్ సాగర్ వద్ద ఎదురుగా వస్తున్న ఓ కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అనాస్, సమీర్ అక్కడికక్కడే మృతిచెందారు. మరో యువకుడు కరీంకు తీవ్ర గాయాలుకాగా..స్థానికులు దవాఖానకు తరలించారు. ఘటనా స్థలాన్ని సౌత్ రూరల్ సీఐ వెంకట నారాయణ పరిశీలించి, ప్రమాదం జరిగిన తీరును స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ఆరో టౌన్ ఎస్సై –2 మొగులయ్య, సిబ్బంది చర్యలు చేపట్టారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు.

### భిక్కనూరు జాతీయ రహదారిపై.. మరో ఇద్దరు



నిఖిల్‌రెడ్డి (ఫైల్)

భిక్కనూరు మండలం జంగంపల్లి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జంగంపల్లి గ్రామానికి చెందిన గుండ వెంకటేశం (47) తన సైకిల్‌పై స్థానిక సాయిబాబా ఆలయం ముందు నుంచి రోడ్డు దాటుతుండగా.. కామారెడ్డి నుంచి దోమకొండ వైపు వస్తున్న ద్విచక్ర వాహనం వేగంగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో వెంకటేశం అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్‌పై ఉన్న దోమకొండకు చెందిన నాయిని నిఖిల్‌రెడ్డి(25)కి తీవ్ర గాయాలు కాగా కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించగా..అప్పటికే మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

